క్లుప్తంగా

ఏఆర్ ఏడీసీపీగా కోటేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ ఏఆర్ అడిషనల్ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏడీసీపీ)గా కుంభా కోటేశ్వరరావు గురువారం ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు ఏఆర్ ఏఎస్పీగా పని చేస్తున్న ఆయన ఎన్టీఆర్ కమిషనరేట్‌కు నియమితులయ్యారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం పోలీస్ కమిషనర్ టి.కె.రాణాను మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్ప గుచ్ఛం అందజేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): త్వరలో జరగనున్న 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సీఐ జి.గురుప్రకాష్ గురువారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో సమస్యలు ఏమైనా ఉన్నాయా అని పరిశీలించి ఏవైనా లోపాలు ఉంటే వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సీఐ గురుప్రకాష్ తెలిపారు.

నున్న పోలీస్‌స్టేషన్ పరిధిలో..

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజీవ్‌నగర్, సుందరయ్యనగర్, ఎల్‌బీఎస్ నగర్, కండ్రిక, వాంబేకాలనీ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను సీఐ ఎస్.దుర్గాప్రసాద్ గురువారం పరిశీలించారు. ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను గురువారం గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు, సౌకర్యాలు, శాంతిభద్రతల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సై వెంకట్రావు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపికైన ఎస్ఆర్ఆర్ విద్యార్థి



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎస్‌కే ఖాసీంబాషా రాష్ట్రస్థాయి రెజ్లింగ్ అండర్-20 ఛాంపియన్ షిప్ గ్రీకు రోమన్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో ఎస్‌కే ఖాసిం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కే భాగ్యలక్ష్మి శాలువ, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు భోపాల్‌లో జరిగే పోటీల్లో సత్తాచాటి కళాశాల పేరు ప్రఖ్యాతులు ఇనుమడింప చేయాలని ఆకాంక్షించారు. కళాశాల వ్యాయామ అధ్యాపకుడు మండవ కోటేశ్వరరావు, డీ యుగంధర్, అధ్యాపకులు డాక్టర్ డీఎస్‌వీఎస్ బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ కే రమేష్, సిబ్బంది ఖాసీంను అభినందించారు.

అలరించిన భక్తి రంజని



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో చెన్నైకి చెందిన ఆర్ పద్మా చక్రవర్తి, ఎస్. నాగలక్ష్మిల బృందం ఆలపించిన భక్తిరంజని భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై పలు కీర్తనలు ఆలపించారు. అనంతరం అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు ప్రసాదాలు అందజేశారు.

చేతుల పరిశుభ్రతతో వ్యాధుల నివారణ

పటమట(విజయవాడతూర్పు): చేతుల పరిశుభ్రతే ప్రజల ఆరోగ్యానికి భద్రత అని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. రాజీవ్‌గాంధీ పార్కులో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, యూనిసెఫ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కాంటాక్ట్‌లెస్ హ్యాండ్‌వాష్ స్టేషన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఒకరు వాడిన హ్యాండ్ వాష్‌ను ఇంకొకరు వాడకుండా ఉండేటందుకు కాంటాక్ట్ లెస్ హ్యాండ్ వాష్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్నామని చెప్పారు. పార్కుకు వచ్చే ప్రజలు తప్పనిసరిగా ఈ కాంటాక్ట్ లెస్ హ్యాండ్ వాష్ స్టేషన్ వినియోగించుకోవాలని కోరారు. చేతుల పరిశుభ్రత ద్వారా 70 శాతం వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చని వెల్లడించారు. కోవిడ్, ఇతర వైరస్‌లను జయించడానికి చేతుల పరిశుభ్రత ఆవశ్యకతపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (జనరల్) శకుంతల, ఉద్యానవన విభాగం అధికారి చొప్పర శ్రీనివాసులు, మెప్మా, పట్టణ సామాజికాభివృద్ధి విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు



23వ డివిజన్‌లో పెన్షన్ కానుక అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దూసుకుపోతుందని సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 23వ డివిజన్ సీతారాంపురం ఏరియాలో గురువారం ఆయన ప్రతి గడపకు వెలంపల్లి శ్రీనివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గడప గడపకు తిరిగి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఒకటో తేదీ కావడంతో డివిజన్‌లోని పెన్షనర్లకు పెన్షన్ కానుక అందజేశారు. వెలంపల్లికి స్థానికులు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ ప్రభుత్వ పనితీరు బాగుందంటూ ప్రజలు మెచ్చుకుంటున్నారని చెప్పారు. మరోసారి ఈ రాష్ట్రానికి వైఎస్ జగనే సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. జగనన్న ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను నేరుగా ఇంటి వద్దనే అందజేస్తున్నారని వెల్లడించారు.

ప్రతిపక్షాలవి దిక్కుమాలిన రాజకీయాలు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుంటే ప్రతిపక్షాలు దిక్కుమాలిన రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. దొంగ నాటకాలు వేయడంలో పవన్‌కళ్యాణ్ దిట్ట అని అన్నారు. చంద్రబాబు జెండా మోయడమే ఆయన ఎజెండా అన్నారు. చంద్రబాబు ఇచ్చే ప్యాకేజీ కోసం పవన్‌కళ్యాణ్ ఎదురుచూస్తున్నాడని విమర్శించారు. జగన్ చేసిన అభివృద్ధిలో 10 శాతం కూడా చంద్రబాబు చేయలేదని పేర్కొన్నారు.

బోండా ఉమా ఆటలు సాగవు

సెంట్రల్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే బోండా ఉమా ఆటలు ఇకపై సాగవని వెలంపల్లి అన్నారు. గతంలో ఉమా ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన దందాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని పేర్కొన్నారు. కబ్జాలకు రౌడీయిజానికి పాల్పడితే బోండా ఉమాకు తాటతీస్తామని హెచ్చరించారు. 2014లో ఎమ్మెల్యేగా ఆర్‌యూబీ పూర్తి చేయలేకపోయారన్నారు. విదేశాలకు వెళ్లి పేకాట క్యాసినో ఆడేవాడికి అభివృద్ధి గురించి ఏం తెలుసని ప్రశ్నించారు. ఆయన తనయులు బైక్ రేసుల్లో అమాయకుల ప్రాణాలు తీశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డివిజన్ ఇంఛార్జ్ ఆత్మకూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

59వ డివిజన్‌లో..

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 59వ డివిజన్‌లో ప్రతి గడపకు వెలంపల్లి శ్రీనివాస్ కార్యక్రమం గురువారం జరిగింది. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా, కోఆప్షన్ సభ్యుడు అలీమ్‌లతో కలిసి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు డివిజన్‌లో పర్యటించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. పలు దేవస్థానాలు, దర్గాలు, చర్చిలకు వెళ్లి ఆయా సంఘాలు, కమిటీల పెద్దలతో మాట్లాడారు. అనంతరం డివిజన్ వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లాను భారీ ఫ్రూట్స్ గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎండీ హఫీజుల్లా, నందెపు సురేష్, దేవిరెడ్డి రమేష్‌రెడ్డి, చింతా చిన్నా, చింతా శ్రీను, కోలా శాంతకుమారి, షేక్ అమిత్, రాజు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.



పండ్ల గజమాలతో ఎమ్మెల్యే వెలంపల్లి, ఎమ్మెల్సీ రుహుల్లాకు స్వాగతం పలుకుతున్న నాయకులు

ఆరోగ్య కార్యకర్తలను క్రమబద్ధీకరించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్న ఆరోగ్య కార్యకర్తలను క్రమబద్ధీకరించాలని ఏపీ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రాష్ట్ర వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డిని గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆదాల వెంగళరెడ్డి కాంట్రాక్టు ఆరోగ్య కార్యకర్తల సర్వీస్ క్రమబద్ధీకరణ కోసం చేస్తున్న అప్లోడింగ్ సాంకేతిక సమస్యలతో నిలిపివేయడాన్ని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ కోసం చేసిన చట్టంలోని నిబంధనలకు లోబడి పని చేస్తున్న 1207 మంది ఆరోగ్య కార్యకర్తలను రెగ్యులర్ చేయడానికి ఎలాంటి ఆటంకం లేదని గౌతంరెడ్డి అన్నారు. ఈ విషయంపై ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ కమిషనర్ కృష్ణబాబు, కమిషనర్ నివాస్‌లతో ఆయన మాట్లాడారు. దీనిపై ప్రిన్సిపల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.



డాక్టర్ గౌతంరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

కార్యక్రమంలో వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేసా ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టీ రమణారెడ్డి, నెల్లూరు జిల్లా వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడు కిరణ్, విశాఖపట్నం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్‌పి చారి, జగదీష్, కిరణ్, నాగరాజు, శ్రీకాకుళం జిల్లా నాయకులు మురళి, సత్తిరాజు, విజయనగరం జిల్లా నాయకులు నాగరాజు, బుచ్చినాయుడు, వేణు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ ఆర్డీఓగా భవానీ శంకర్

కలెక్టర్ ఢిల్లీరావును మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్డీఓ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ ఆర్డీఓగా బీహెచ్ భవానీ శంకర్ గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. భవానీ శంకర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆర్డీఓ భవానీ శంకర్ మాట్లాడుతూ చాలా కీలకమైన విజయవాడ డివిజన్ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు ప్రజలకు పూర్తి స్థాయిలో అందించి.. వాటి లక్ష్యాలు నెరవేరేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.



కలెక్టర్ ఢిల్లీరావును మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్డీఓ భవానీశంకర్

ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతీ ఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష అన్నారు. 31వ డివిజన్ పసుపుతోటలో గురువారం వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి పింఛన్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కులమత, రాజకీయాలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్ సుపరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం, డాక్టర్ పిల్లి జయకృష్ణ, అంగిరేకుల విజయ్, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు పాల్గొన్నారు.

27వ డివిజన్‌లో..

మధురానగర్ (విజయవాడసెంట్రల్): స్థానిక 27వ డివిజన్ దుర్గాపురంలో గురువారం తెల్లవారుజామున 5 గంటల నుంచే పింఛన్ పంపిణీ కార్యక్రమం ప్రారంభమయ్యింది. వలంటీర్ బీ కిరణ్మయి, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు కే రాముతో కలిసి పింఛన్ అందజేశారు. పొద్దుపొడవక ముందే పింఛన్ అందజేయటం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.



పింఛన్ అందజేస్తున్న కార్పొరేటర్ శిరీష

ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల్లో మాలలకు ప్రాధాన్యం ఇవ్వాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాబోయే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు మాలలకు అధిక సంఖ్యలో ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలు కేటాయించాలని మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ కోరారు. గాంధీనగర్‌లోని ఐలాపురం హోటల్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వుడు స్థానాలు తప్ప మిగిలిన స్థానాల్లో దళితులకు సీట్లు కేటాయించడం లేదన్నారు. నియోజకవర్గాల వారీగా దళిత ఓటర్లను గుర్తించి ఇతర స్థానాల్లోనూ దళితులకు ప్రాధాన్యం కల్పించాలని కోరారు. రాబోయే రోజుల్లో దళితులను ఆదరించే పార్టీలకే తమ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి సంది జయరాజు, ప్రధాన కార్యదర్శి నేతల సాల్మాన్ రాజు, చిల్లే రాజ్‌కుమార్, బాబు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఆరోగ్య కార్యకర్తలకు సూపర్‌వైజర్లుగా పదోన్నతి కల్పించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళా ఆరోగ్య కార్యకర్తలకు హెల్త్ సూపర్ వైజర్లుగా ప్రమోషన్‌లు కల్పించాలని ఏపీ ఉమెన్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అండ్ ఉమెన్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు వీకేఎన్ జయలక్ష్మి విజ్ఞప్తి చేశారు. గురువారం గాంధీనగర్‌లోని ఎన్జీఓ భవన్‌లో అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎం.సుహాసిని, ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌ను కలిసి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరినట్లు తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి హెల్త్ ఎంప్లాయిస్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు ఆర్‌వీ రమణ, వై వరలక్ష్మి, నాగమణి, శుభశ్రీ తదితరులు పాల్గొన్నారు

ఎస్ఆర్ఆర్‌లో తెలుగు పరిచయం కోర్సు ప్రారంభం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ ఆడిట్ ఆఫీస్ సభ్యులకు ఏర్పాటు చేసిన 'తెలుగు పరిచయం' కోర్సును గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే భాగ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కోర్సు ద్వారా కేంద్ర ప్రభుత్వ ఆడిట్ ఆఫీస్‌కు చెందిన 33 మంది ఆఫీసర్లు తెలుగు భాషలో శిక్షణ పొందుతారని తెలిపారు. శిక్షణ అనంతరం వారికి సర్టిఫికెట్ ప్రదానం చేస్తామని అన్నారు. ఈ సర్టిఫికెట్ పొందిన వారు మాత్రమే ఉద్యోగంలో పర్మనెంట్ అవుతారని తెలియజేశారు. ఈ మేరకు ఎస్ఆర్ఆర్ కళాశాలకు ఏజీ ఆఫీసుకు మధ్య పరస్పర ఒప్పందం ఉన్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ పోలీసు అధికారులు, సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు



రిటైర్డ్ పోలీసులను సన్మానించి వీడ్కోలు పలుకుతున్న అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు

విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వర్తిస్తూ జనవరి 31వ తేదీన ఉద్యోగ విరమణ పొందిన అధికారులు, సిబ్బందికి అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు ఆత్మీయ వీడ్కోలు పలికారు. విజయవాడలోని కమిషనరేట్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రిటైర్డ్ అయిన ఎస్సీ, ఎస్టీ సెల్ ఎస్ఐ సత్యనారాయణ, సింగ్‌నగర్ స్టేషన్ ఏఎస్ఐ హేమచందర్, పటమట స్టేషన్ ఏఎస్ఐ దుర్గారావు, ఏఆర్ ఏఎస్ఐలు రామబ్రహ్మారావు, సాంబశివరావు, సీటీసీ హెడ్‌కానిస్టేబుల్ అబ్దుల్‌మాలిక్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణలను శాలువాలతో సత్కరించారు. సుదీర్ఘకాలం పాటు పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు సేవలందించిన వీరిని అభినందించారు.

వివాహితకు అత్తింటి వేధింపులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహితను అత్తింటి వారు వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు కొత్తపేట పోలీసులను ఆశ్రయించింది. అత్తింటి వారిపై గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... టైలర్‌పేట పెనుమాక దేవదాసు వీధికి చెందిన శివజ్యోతి 2021లో పెడనకు చెందిన వీణం సాయి ప్రవీణ్ పవన్‌కుమార్‌ను ప్రేమించి పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. శివజ్యోతి ప్రస్తుతం 49వ డివిజన్ 167వ సచివాలయ పరిధిలో వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తోంది. పెడనలో కాపురం ఉన్న సమయంలో అత్తింటి వారు శివజ్యోతిని వేధింపులకు గురి చేశారు. దీంతో పుట్టింటి నుంచి రూ. 7 లక్షలు భర్త, అత్త పార్వతి ఆడపడుచు విష్ణుమహంతి సరితకు ఇచ్చారు. గత ఏడాది విజయవాడకు బదిలీపై వచ్చిన శివజ్యోతికి ఇక్కడ కూడా వేధింపులు ఎక్కువ కావడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మురుగు కాలువల్లో సిల్టు తొలగింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 32వ డివిజన్‌లో దోమల నివారణ చర్యల్లో భాగంగా గురువారం పారిశుద్ధ్య కార్మికులు మురుగు కాలువల్లో సిల్టు తొలగించారు. ఈ సందర్భంగా మురుగు కాలువల్లో చెత్తచెదారం వేయరాదని వారు సూచించారు.

వైఎస్సార్ ఆసరాతో రుణమాఫీ

పాయకాపురం(విజయవాడరూరల్): డ్వాక్రాగ్రూపు మహిళలకు పాదయాత్రలో జగనన్న ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ ఆసరాతో 61వ డివిజన్ వాంబే కాలనీ 262వ సచివాలయం పరిధిలో వెన్నెల స్వయం సహాయక గ్రూపు మహిళలకి బ్యాంక్ రుణం నుంచి విముక్తి లభించింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో వెన్నెల స్వయం సహాయక సంఘం ఆంధ్రాబ్యాంక్ నుంచి ఒక్కొక్క సభ్యురాలు లక్ష రూపాయల చొప్పున రుణం తీసుకోవడం జరిగింది. వాయిదాల పద్ధతిలో బ్యాంక్ రుణం తీర్చలేక మహిళలు అవస్థలు పడుతూ కొన్ని వాయిదాలు తీర్చడం జరిగింది. గతంలో చంద్రబాబు డ్వాక్రా గ్రూపు మహిళల బ్యాంకు రుణాలను పూర్తిగా రద్దు చేస్తామని చెప్పి పుసుపు కుంకుమ కింద కేవలం రూ. 10 వేలు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. దీంతో అక్కాచెల్లిమ్మలపై మోయలేని భారం పడింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం అక్కాచెల్లెమ్మలకు వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగు విడతలుగా పూర్తి రుణమాఫీ చేశారు. వెన్నెల డ్వాక్రా గ్రూపులోని పది మంది మహిళా సభ్యులకు రూ. 1.60 లక్షలు లబ్ధిచేకూరింది.



వెన్నెల ధ్వాక్రాగ్రూపు సభ్యులు

మాట తప్పని జగనన్న..



మాట తప్పని మడమ తిప్పని జగనన్న ఇచ్చిన మాట ప్రకారం బ్యాంక్ రుణాన్ని నాలుగు విడతలుగా రుణం చెల్లించడం చాలా సంతోషంగా ఉంది. మా గ్రూపులోని 10 మందికి రూ. 1.60 లక్షల రుణం మాఫీ అయ్యింది. గ్రూపు సభ్యులం వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు తీర్మాణం చేసుకున్నాము.

గొల్లమండల మాధవీకృష్ణ,
వెన్నెల డ్వాక్రాగ్రూపు అధ్యక్షురాలు

రుణం నుంచి విముక్తి..



వైఎస్సార్ ఆసరాతో మా గ్రూపులోని సభ్యులందరికీ రుణం నుంచి విముక్తి లభించింది. వైఎస్సార్ ఆసరా లేకుంటే బ్యాంక్‌లో తీసుకున్న రుణం వడ్డీతో చెల్లించలేక ఇబ్బంది పడేవాళ్లం. బ్యాంక్ రుణాన్ని జగనన్న తీర్చడంతో బడ్డీకొట్టు పెట్టుకొని జీవనం గడుపుతున్నాను.

చీకటి నాగమణి
డ్వాక్రాగ్రూపు సభ్యురాలు

7 నుంచి శ్రీదత్తసాయి మందిరం వార్షికోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు మందిరం 9వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు తెలిపారు. మందిరంలో గురువారం మీడియా సమావేశంలో వార్షికోత్సవ వివరాలు తెలియజేశారు. 7వ తేదీ బుధవారం ఉదయం 5.15 గంటలకు కాగడ హారతి, విఘ్నేశ్వర పూజలతో వేడుకలు ప్రారంభమవుతాయని అన్నారు. 8న మధురానగర్ పురవీధుల్లో బాబావారి భిక్షాటన నిర్వహిస్తామన్నారు. 9న బాబావారికి 21 దివ్య ద్రవ్యములతో అభిషేకం, అన్నాభిషేకం, లక్ష్మీగణపతి హోమం జరుగుతాయని పేర్కొన్నారు.

బాబాకు ప్రత్యేక పూజలు

గురువారం బాబాకు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు 400 మందికి అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి మోహనరావు పర్యవేక్షించారు.



భోజనాలు వడ్డిస్తున్న నిర్వాహకులు

నగరాభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి

స్థాయీ సంఘం సమావేశంలో మేయర్ భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో గురువారం స్థాయీ సంఘం సమావేశం నిర్వహించారు. అజెండాలో మొత్తం 25 అంశాలు ప్రతిపాదింగా అందులో 18 ఆమోదిస్తూ సభ్యులు తీర్మానం చేశారు. రెండు అంశాలు వాయిదా వేయగా మూడు ర్యాటిఫై చేశారు. ఒక అంశాన్ని రికార్డు చేయగా, మరో అంశాన్ని ధ్రువీకరిస్తూ తీర్మానించారు. ఆయా విభాగం అధికారులు, స్థాయీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రధానాంశాలు :

- సర్కిల్-1 పరిధిలోని 44వ డివిజన్ ఆర్ఆర్ నగర్ వాటర్ ట్యాంక్ రిటైనింగ్ వాల్ సీసీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన రూ.47.41 లక్షలు వీఎంసీ జనరల్ బడ్జెట్ నుంచి కేటాయించాలని వచ్చిన ప్రతిపాదనను సభ్యులు ఆమోదిస్తూ తీర్మానం చేశారు.
- వీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రామరాజ్యనగర్, రాజీవ్‌నగర్, కృష్ణలంకలోని మెటర్నిటీ హాస్పటల్స్‌లో వైద్య సేవలు అందిస్తున్న డెంటల్ అసిస్టెంట్ సర్జన్, స్టాఫ్‌నర్స్, హెల్త్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్స్, ఆయాలు, ల్యాబ్ అటెండెంట్స్ మొత్తం 14 మంది వైద్య సిబ్బంది కాంట్రాక్ట్ పద్ధతిపై విధులు నిర్వహిస్తున్నారు. వీరందరికీ ఈ ఏడాది మార్చిలో గడువు ముగుస్తున్నందున వారికి గడువు పొడిగించాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు వాయిదా వేస్తూ తీర్మానించారు.
- సర్కిల్-2 పరిధిలోని భగత్‌సింగ్ రోడ్డు, బీఆర్‌టీఎస్‌రోడ్డు, ఫుడ్ జంక్షన్ నుంచి అజిత్‌సింగ్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి మరమ్మతులకు గురైనందున ఈ రోడ్డులో బీటీరోడ్డు లేయర్ వేయటానికి అవసరమయ్యే రూ.45.51 లక్షలు వీఎంసీ జనరల్ ఫండ్స్ నుంచి విడుదల చేయాలని వచ్చిన ప్రతిపాదను సభ్యులు ఆమోదించారు.



స్థాయీ సంఘం సమావేశం నిర్వహిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

స్వయంకృషితో ఎదిగిన నటుడు చిరంజీవి



విజయవాడ కల్చరల్: స్వయంకృషితో ఎదిగిన నటుడు చిరంజీవి అని శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. మహానటి సావిత్రి సాంఘిక సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం పద్మవిభూషణ్ పురస్కారం అందుకున్న చిరంజీవి అభినందన, సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ప్రతిభ ద్వారా అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించారని చిరంజీవిని కొనియాడారు. ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి, చిరంజీవి యువత సభ్యులు కృష్ణప్రసాద్, శ్యాంప్రసాద్, జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్, విశ్రాంత పోలీస్ అధికారి డేవిడ్‌రాజు, ప్రభల శ్రీనివాస్, చిరంజీవి సినీ జీవిత విశేషాలను వివరించారు. గాయనీ గాయకులు చిరంజీవి చిత్రాలలోని పాటలను గానం చేశారు.